**"ఈ రకమైన ప్రశ్నలతో నన్ను విసిగించకు!"**

**"నేనెప్పుడు అడిగినా, సరిగ్గా చెప్పవెందుకమ్మా!"**

**"ముద్దికిందికి పదిహేడేళ్లు వస్తున్నాయి, అయినా బుద్ధిమాత్రం రావట్లేదు!"**

**"నీకర్థమయ్యా, నీకు వచ్చేదే బుద్ధా?"**

**"మాటకు మాట మాబాగా నేర్చావు ... నా దుంపతెంపేస్తోంది కదమ్మా, ఈ రాక్షసి!"**

**"గాల్లోకి చూసి మాట్లాడతావెందుకు? అనేదేదో నా కళ్లల్లోకి చూస్తూ అను!"**

"ఉన్నాయిలే, ఆల్చిప్పల్లా ఇంతింత కళ్లు! పొద్దుట్నించి వాటికి కాటుక పెట్టుకోవడంలోనే టైమంతా అయిపోతోంది!"

"కష్టపడి చదువుకోవడంలో కూడా అవుతోంది!"

"ఏం చదివావే? ఈరోజు అసలు పుస్తకం ముట్టావా? నేను ఆఫీసునుంచి వచ్చేటప్పటికి గుర్రుపెడుతున్నావు. ఇది నిద్రపోవాల్సిన వయసా? ఎంత పని చేసుకోవాలి? నీ బట్టలకి గంజి పెట్టుకోవాలి, ఆ దుపట్టాలన్నీ స్టిఫ్‌గా చేసుకోవాలన్నావు. కనీసం అదైనా చేశావా?"

".... ఏదీ చూడకుండా మాట్లాడతావు. వెనక బాల్కనీవైపు అసలు వెళ్లావా?"

"... ..."

"చెప్పమ్మా! జెలసీకి, ఎన్వీకి తేడా ఏమిటి?"

"అసూయ, ఈర్ష్య - రెండింటికీ వేరే అర్థం ఉందని తెలుసుగానీ, ఎలా చెప్పాలో తెలీట్లేదు. ప్లీజ్, సవితా! నన్ను విసిగించకు!"


"నీకు మహా అహంకారం!"

"ఇంకా నయం, అదే నన్ను కాస్త నిలబెట్టింది. నాకు బతుకులో కోరికంటూ ఏదైనా ఉంటే మరొకళ్లమీద ఆధారపడకూడదని! ఐ హేట్ సబార్డినేషన్!"

"హ్హా....హ! ఎవరిపట్లయినా కాస్త

# ధాటు స్వరం

## కిరణ్మయి




మర్యాదగా ఉండటం సబార్డినేషన్ అనుకుంటావు. ఖర్మ!"

"మన వ్యక్తిత్వాన్ని నిలుపుకునేందుకు ఎప్పుడూ కాస్త అగ్రెసివ్‌గా ఉండటం తప్పు లేదు సరికదా, ఆడవాళ్లకి నా దృష్టిలో మరీ అవసరం."

"వ్యక్తిత్వం..... రబ్బిష్ వ్యక్తిత్వం

పేరుతో ఎవరు ఎన్ని మోసాలు చేసినా భరిస్తారు. గంపెడు దుఃఖాన్ని దిగమింగుకుంటూ - ఎనీ లవింగ్ వర్డ్, జెస్చర్ ...! అంతే! ఎవరికైనా 'ఫిదా' అయిపోతారు. ఉఫ్ ... వ్యక్తితవం అంటే నీ దృష్టిలో ఏమిటమ్మా?''

"ఎవరి అర్థం వాళ్లకే ఉండొచ్చు. నా దృష్టిలో నా గౌరవాన్ని పణంగా పెట్టని ఏ పనైనా నా




వ్యక్తిత్వాన్ని పెంచేదే!''

"పచ్చి అబద్ధం!''

"పరమ నిజం!''

"కాదు, మమ్మీ! కోపం తెచ్చుకోకు. నీ జీవితం అంతా ఇదే నమ్ముతూ నమ్ముతూ, ఇప్పుడు నువ్వు ఏ స్థితికి వచ్చావో తెలుసా? నీ మీద 'వ్యక్తిత్వం' - 'గౌరవం' భారంపెట్టని ఏ మగవాడినైనా నిజాయితీపరుడు అనో, ఇమోషనల్ పర్సన్ అనో పేరు పెట్టుకుని ప్రేమ చూపిస్తున్నావు. నిన్ను జడ్జ్ చేద్దామని కాదు, ఇలా మాట్లాడుతోంది ... కానీ, ఒకోసారి మనం నమ్మే విషయం ఎంత మోసంలో పడేస్తుందంటే, దానికి పూర్తి భిన్నకోణంలో ఉన్న వ్యక్తి మనకు నచ్చేయడం మొదలుపెడతాడు. అది వాడి గొప్పతనమూ కాదు, మన ఓటమీ కాదు. నాకైతే ఒక విధమైన అమాయకత్వం అనిపిస్తుంది. మనసంతా బాధగా అయిపోతుంది. నీలాంటి ఆడవాళ్లు ఎలా మనసు కాల్చుకోకుండా బయటపడతారా అని ఎదురు చూస్తాను. కానీ ప్రతిమనిషిలోనీ మూర్ఖత్వంపాలు కూడా మనం మర్చిపోకూడదు కదా! దాంతో తగలాల్సిన దెబ్బలు తగులుతాయి. గుక్కతిప్పుకుంటూ మరింత కరుడుగట్టిపోతారు. ప్చ్ ....!''

"ఓహ్! చాలానే స్టడీ చేశావు.''

"అందుకే బుద్ధిరావడం అంటే ఏమిటి అని అడిగాను. నీకు నచ్చాలంటే, నాకు బుద్ధిలేకపోయినా ఫర్వాలేదు!''


"సవీ! నేనంటే నీకంత కోపమా?''

"పరమ అసహ్యం.''

"...!''

"ఎందుకంటే, నువ్వేనాడూ నీ ఏ ఎమోషన్నీ సరిగ్గా అర్థం చేసుకోలేదు. అర్థం చేసుకుంటే దానిలోని అన్ని పొరలూ కుంచెతో కొద్దికొద్దిగా రంగుల్ని అద్దినట్టు నీకు తెలిసొచ్చేది. నువ్వు ఊరికే దబాయిస్తావు. మనసుతో కూడా దబాయించుకుంటావు. నీలా దబాయించేవాళ్లకు ఈలోకంలో చాలా ఫాన్ ఫాలోయింగ్ ఉంటుంది. అదంతా నిజమని నమ్మితే స్టుపిడిటీ ... బస్! నీ ఎమోషన్ పక్కన పెట్టి మరెవరితోనో మాట్లాడతావు. నీతో నువ్వు మాట్లాడుకోవు, ప్రశ్నించుకోవు, తిగరతోడుకోవు. సగం సగం చేసే

## ఎవరిష్టం?



మళ్లీ ఏడు సంవత్సరాల తరువాత కలం పట్టి 'అనగనగా ఓ అమ్మాయి' సినిమాకి మాటలు రాస్తున్నారు తనికెళ్ల భరణి. నిజానికి నటుడిగా ఉంటూ రచయితగా కొనసాగడం అనే విషయం కష్టంగా తోచడంవల్లే రచనల జోలికి వెళ్లడం మానుకున్నాననీ, ఇప్పటికి సమయం చిక్కడంవల్ల మళ్లీ కలాన్ని సంధించాననీ చెప్పారాయన.

"సినిమాలకు రచయితగా కంటిన్యూ అవుతారా?" అంటే, "అది కుదరని పని!" అన్నారు.

"మీలోని రచయితంటే మీకు ఇష్టమా? నటుడంటేనా?" అని అడిగితే, తడుముకోకుండా ఇలా చెప్పారు-

"నాలోని రచయిత నాకే కాకుండా చాలామందికి నచ్చుతాడు. కానీ నాలోని నటుడు అప్పుడప్పుడుతప్ప నాకు నచ్చడు!"

లలిత

ప్రయత్నాలన్నా, జ్ఞానం సంపాదించుకుందాం అనే జిజ్ఞాస లేకుండా ఊరికే పైకి మాట్లాడేవాళ్లంటే నాకుమంట. అందులో నువ్వుండటం దురదృష్టకరం. లేకపోతే, మనం తల్లీ కూతుళ్లం అయి ఉండటం వలన కూడా విషయాలు కాంప్లికేటెడ్ అయి ఉండొచ్చు."

"నువ్వంటే నాకెందుకిష్టమో తెలుసా? నా కూతురువని కాదు, మహా నిజాయితీ మనిషివి. సూటిగా మాట్లాడతావు. వెరీ వెరీ ఆనెస్ట్!"

"నేను ఇందాక చెప్పిన కోణం దీనిగురించే!"

"అంటే నేను నిజాయితీ లేని మనిషినేనా?"

"... ..."

"ఎంత దుర్మార్గురాలివే!"

"నిన్ను నువ్వు ఎందుకు మంచిదానివనుకుంటావమ్మా? అలా అనుకున్నన్నాళ్లు నేను దుర్మార్గురాలిగానే కనిపిస్తాను - నీ ద్వారా పదిమందికి వినిపిస్తాను."

"అసలు నువ్వు పదిహేడేళ్ల అమ్మాయివేనా?"

"ఇందాక నువ్వేగా గుర్తుచేశావు. బహుశా పద్దెనిమిదయ్యుంటాయి. నీ వయసు కూడా నా వయసుతో ముడిపడి ఉందిగా!"

"నేను నీ వయసులో ఏదీ తెలియని పిచ్చిదాన్ని."

"పాపం, ప్చ్ ....!"

"నిజంగా! నేనేం జోక్ చెయ్యట్లేదు. ఆ సంవత్సరాలు చాలా నెమ్మదిగా గడిచాయనిపిస్తుంది. ఆ తర్వాత సంవత్సరాలు గబగబా రకరకాల నిర్ణయాలతో పరుగుపందెంలా తలో దిక్కుకూ నడిచాయి."

"వయసుదేముందమ్మా?"

"వయసుతో చాలా ఉందే ... అది నీకు ఓ పదిహేనేళ్ల తర్వాత తెలుస్తుంది.'

"నాకు నీలాగా పాకులాడ్డం అంటే ... యాక్! ఐ జస్ట్ కాన్ట్ థింక్ ఆఫ్ ...!"

"ఇంతకీ జెలసీకీ, ఎన్వీకి తేడా నీకే తెలుసుండాలే! నన్ను ఊరికే పరీక్ష పెట్టడానికి అడుగుతున్నావు. అవునా?"

"అబ్బే, లేదు మమ్మీ! నాకు చూచాయగా తెలుసు. అవునో, కాదో చెప్పు. 'ఎన్వీ' అంటే, నాకు మంచి కారుంది. నీకు లేదు. నీకు నన్ను చూస్తే ఈర్ష్య. ఐ మీన్ యు ఎన్వీ మీ. నాకూ కారుంది. నువ్వూ కారు కొనుక్కున్నావు. అప్పుడు నిన్ను చూస్తే నేను అసూయ పడతాను - జెలస్ ఆఫ్ యువర్ పొజెషన్ ... నీకంటే బాగా ఉండలాని తాపత్రయపడతాను! రైట్?"

"అబ్సెల్యూట్లీ!"

"అంత ఖచ్చితంగా తెలిసినదానివి చెప్పలేకపోయావూ?"

"నాకు నీలా చెప్పడం చేతకాదు."

"నువ్వేనాడూ ప్రశ్నించి, చెప్పే ప్రయత్నం చెయ్యలేదు. చెప్పలేవంటే నేనొప్పుకోను."

"నీదెంతైనా మీ నాన్న పోలికే!"

"అమ్మా ...! ప్లీజ్ ...!"

"ఆయన నన్ను కాల్చుకుతిన్నాడు కానీ, ఉన్న మంచి లక్షణాలు ఎలా కాదనగలను చెప్పు! ఆ రాక్షస లక్షణాలే నీలో వచ్చాయి. కాస్త నా మంచితనం కలిసింది కాబట్టి బతికిపోయాను."

"ఏమో, నాకు నాన్న అంత రాక్షసుడని ఎప్పుడూ అనిపించలేదు. నాకే గనక ఆయనలాంటి మొగుడు దొరికితేనా ... భలే మార్చేస్తాను!"

"నాకే గనక నీ వయసు తిరిగి వస్తేనా ... ఆయన జ్ఞాపకం కూడా లేకుండా తుడిచిపారేస్తాను!"

**నోట్ : పక్కస్వరాన్ని వదిలి, తర్వాతి స్వరాన్ని కలుపుకుంటూ సాగేది 'దాటు స్వరం'. సంగీత పాఠాలలో గొంతు సాధనకోసం నేర్పుతారు.**

■

